# ఓ క్షేత్రయ్యా...

— ఎమ్మెస్సార్

అది జ్ఞాపకముంచుకోవాలనీ... ఇది మర్చిపోవాలనీ... ప్రయత్నపూర్వకంగా చేయడంలోనే కాలం నడుస్తుంటుంది. ఆ కాలాన్ని అరాయించుకుంటూ మనసు బ్రతుకుతున్నట్టుంటుంది.

రాత్రంతా నిద్రలేకుండా ఆలోచించి ఆ విషయం మర్చిపోవాలని ఓ నిర్ణయానికి వచ్చి మళ్ళీ తెల్లవారగానే ఎందుకు మర్చిపోవాలో జ్ఞాపకం వచ్చి...

• • •

సుమ వచ్చి రెండురోజులయింది.

• • •

నేను మద్రాసు వచ్చిన సంవత్సరానికి గానీ సుమకి దగ్గరగా రాలేకపోయాను. వయస్సు అరవైలో పడిన మా పెత్తల్లికి దత్తుగా తిరుత్తణినుండి నన్ను మావాళ్ళు తరిమారు. అన్నయ్యలందరికీ పెళ్ళిళ్ళయిపోయాయి. చిత్రమ్మామ్మకి ఇక్కడ మద్రాసులో రెండిళ్ళమీద అద్దె వస్తున్నా అలవాటుగా ఓపూట పస్తుంటుంది. నేనిక్కడ తనతోపాటు ఉంటూ ఫాన్సీషాపు పెట్టాలని నిర్ణయించారు.

ఓ ఫిబ్రవరి నెలలోని శివరాత్రికి నేనొచ్చాను. జీవితంలో నేనెప్పుడూ జాగరణ చేయలేదు. సుమని చూశాక ఆరోజు రాత్రి నాకు నిద్రపట్టలేదు.

వాళ్ళ నాన్నపేరు సుందర్రావు. ఎవరితోనూ మాట్లాడడు. మాట్లాడితే ఇంకెంత బావుంటాడో చూడాలనుకున్నాను.

ఆ మౌనానికి భయపడుతూ అందరిలా అనాలోచితంగా పక్కకి తప్పుకుంటాను. ఆయన భార్య శ్రీలక్ష్మి. లక్ష్మీదేవి అంటూ ఎవరైనా ఉంటే, ఇలా ఉంటేనే బాగుంటుందనిపిస్తుంది. సుమకి ఇద్దరు చెల్లెళ్ళు ఓ తమ్ముడు. ఎలిమెంటరీ స్కూల్లో చదువుతున్నారు. సుమ ఆంధ్రా స్కూల్లో సైన్స్ చదువుతోంది.

గడపదాటి బయటికి రాగానే మెడ ఎత్తి సింహావలోకనం చేసే సుమకళ్ళు నాగస్వరానికి తలూపుతున్న పడగలాగా ఆడుతుంటాయి, చిన్న కర్చీఫ్ లేత చేతుల్లో మడుస్తూ, పిల్లల్ని మందలిస్తూ, మెడవంచి వాళ్ళు చెప్పేది వినడానికి ఆ చిన్ని పెదాల దగ్గర తన చెవులను అలవోకగా తెచ్చివింటూ...

పరికిణీని నడుం మధ్యకి సరిచేసుకుంటున్నపుడు కనిపించే బొడ్డుని చిది

త్రంగా చూసి నవ్వుకుంటూ ...

స్కూలుకి అలా బయల్దేరబోయే ముందు మెడఎత్తి గట్టిగా ఊపిరి పీలుస్తుంది.

ఆకుపచ్చ యూనిఫాంతో సుమ స్కూలుకి వెళ్తుంది. అలా బజార్లోని తన తోటి మొగలి పొదలతోపాటు కలసిపోయినా ... నాకింకా కన్పిస్తూనే ఉంటుంది.

ఇవన్నీ నేను రహస్యంగా చూస్తున్నట్టు సుమకి తెలియదనుకున్నాను.

“కళ్ళ కెదుట కనపడేది కాదు నిజం. మనసా కళ్ళు మూసి వెదకిచూడు ఎద లోపల హంస ...” అంటూ ఓ రోజున సుమ పాడిన పాట వాళ్ళ పాపని నిద్ర పుచ్చడానికా .... నన్ను మేల్కొలుపడానికా ? నాలో నేనే వెతుక్కోలేక సతమతమవుతున్న నేను ఇక బయట పడదామనుకుంటున్నాను. ఇంతలో వేసవి సెలవులు, సెలవలకి అందరూ కలసి ఆంధ్రాలో అదేదో వాళ్ళ చుట్టాల ఊరు వెళ్ళారు. నేను ఆ రోజు బీచికి వెళ్ళాను.

* * *

సుమవచ్చి రెండురోజులయింది.

పాలుతాగిన లేగదూడలా పరుగెత్తడం ఎవరూ పిలవకపోయినా ఉలిక్కిపడి చివాలున వెనక్కి తిరగడం ...

ఒక్కముక్కలో చెప్పాలంటే...



వానలేని వేకువ ఝుమ్మున తెల్లారినంత హడా వుడి ఆ పల్లెటూరినుండే తెచ్చుకున్నదా అన్నట్టుంది.

అక్కడినుండి తెచ్చిన బూడిద గుమ్మడికాయ ఇస్తూ నన్ను సూటిగా చూసింది.

చెప్పొద్దూ ...అంత సూటిగా చూసిందేమో ... సిగ్గుపడ్డాను.

ఇదివరకు తనే తలవంచుకునే సుమ "సిగ్గుపడుతున్నారే" అని నావేపు చూస్తూనే అమ్మ చెవితో ఏదో నవ్వుతూ గొణిగింది. బోసినవ్వుతో అమ్మ అంత గట్టిగా కళ్ళుమూసుకుని నవ్విందంటే - అది నా పెళ్ళిమాటే!

"నాతో చెప్పొచ్చు అన్నాను" కోపంగా.

"స్కూలు టైమైంది" అంటూ పరుగెత్తింది. ఆరోజే సుమని పెళ్ళిచేసుకుంటానని చిత్రమ్మామ్మతో నే చెప్పుకోవడం పాఠం ఒప్పచెప్పినట్టే ఉంది.

* * *

సుమలోని ఈ మార్పు నన్ను కలవరపెట్టింది. ఇంతాఅంతాకాదు. తనిలా ఫ్రాంక్‌గా, డాషింగ్‌గా దూసుకు పోయి నట్లు మాట్లాడడం నాకు ... అవి మొగలివైనా, ముళ్ళుగుచ్చుకున్నట్లుండి ఇబ్బంది పడ్డాను. తన మాటల్లో తృణీకారంలేదు, వ్యక్తిత్వం ఉంది.

మనిషికి వ్యక్తిత్వం ఎలా వస్తుందని ఎన్నాళ్ళు ఆలోచించానో! అలా వచ్చిన సుమని చూశాక ధైర్యం వచ్చింది.

ఆరోజు దీపావళి. నాకొచ్చిన ఒకటీ అరా గ్రీటింగ్‌కార్డ్సు చూపిస్తుంటే తనవి తీసుకొచ్చింది. సుమకి వచ్చిన గ్రీటింగ్స్‌లో ఒకటి .... దానిలో ఏదో ప్రత్యేకత ఉన్నట్టు నాకు తకీమని తట్టింది.

"దానికి ప్రత్యేకతలేకపోలేదు అన్న" ట్లున్నాయి సుమ చూపులు.

పిల్లనగ్రోవితో గోపాలుడు. వింటూ తన్మయత్వంతో చూస్తున్న గోపికా, కింద సంతకం చూశాను.

అమ్మాయిదే అయినా 'అమ్మాయిదేనా?' అన్న నా అనుమానం నాగుండెల్లో "ధాం" అని పేలలేదు. అక్కడ బాంబు ఒకటి ఉందని తెలిసింది చాలు!

అవి నిజమేనన్నట్లు ధగుతున్న బాంబు ఫ్యూజు వెలుగు కన్పిస్తోంది. సుమకి అప్పట్నుంచీ ప్రతివారం ఉత్తరం వస్తోంది. సరిగ్గా శుక్రవారం, దాన్లోనే రిప్లైకి మరో ఇన్‌లాండ్ లెటరుంటుందిట. ఆ శని ఆదివారాల ఆనందం - ఆ ఎక్సైట్‌మెంట్ ... అలవికానిది.

ఓ స్నేహితురాలి ఉత్తరంలో తను ఇంత మత్తులో పడిపోవడం నాకుపిచ్చెక్కినట్టనిపిస్తుంది. పైగా అవి నాక్కూడా చూపించక పోలేదు, ఉత్తరాల్లో మామూలు సంగతులే! ఆడపిల్లలు అలా వెంట వెంటనే ఉత్తరాలు వ్రాసుకోవడం తప్పులేదు గానీ నేను చదవలేక....చదవకుండా ఉండలేక ... ప్చ ... వాళ్ళిద్దరి ఆత్మీయతలో నాకెందుకో అవసరమైన ఈర్ష్య ఉంది.

ఉత్తరాల వరస తప్పడం లేదు.

తనవరస మారడం లేదు.

నా మనసులోని సరసరల వాడి తీరడం లేదు, చిత్రమ్మామ్మతో నా పెళ్ళి సంగతి మళ్ళీ చెప్పాను.

* * *

నేననుకున్నట్టే ఉత్తరాల కింకో రంగు రెక్కలొచ్చాయి. ఆ ఉత్తరాలు అంత క్రమంగా నాగపూరు నుండి వ్రాసే నాగ లక్ష్మికి రెండు నాలుకలన్న గుసగుసలు వాళ్ళింట్లోనే పుట్టిఅక్కడే సమసిపోయినా ఎలాగో నాకు తెలిసింది, దేంక్స్టు నిజం.

పల్లెటూరు వెళ్ళిన సుమకి ఎవరో పరిచయం అయి ఉంటారు. అతను ప్రస్తుతం నాగపూర్లో ఉండి ఉంటాడు. వాళ్ళిద్దరూ అంత కొద్ది రోజుల్లో ఎలా అర్థం చేసుకున్నారు? ఉయ్ మీన్ .... ఎలా ప్రేమించుకున్నారు? చిత్తడి నేలన చెదపుట్టలా పగిలిన నా ఆలోచనలు బాధ పెట్టడంలేదు.
చీకాకు పెడుతున్నాయి.

అంత నిర్లిప్తతలోనూ సుమ నాతో మామూలుగానే మాట్లాడుతోంది.

ఎన్నాళ్ళని గుప్పిట్ను బిగపట్టడం, ఒంటరిగా చూసి ఓ రోజు అడిగాను.

"మీ నాగపూరు స్నేహితుడు ఉత్తరాలు వ్రాయడంలేదా -" అని. అసలలా అడగాలనుకోలేదు. "స్నేహితురాలు" అందామనుకున్నాను. నాకంటె ముందు ఉన్నా నాలో ఎవరో అలా ముందుకువచ్చి కసిగా అనేసినట్టుంటే నేను విడిగా చూస్తూ... సుమ చూసింది. నన్నూ నాలోని "వాడి"ని కూడా కూసినట్టు వేదాంతిలా ఓ నవ్వు వదిలేసింది పట్టుకోమన్నట్టు. పట్టు చిక్కించుకోలేని నావేపు అలానే చూస్తోంది.

పల్చటి గాలికి మొగలి రేకులు విచ్చుకున్నట్టు పెదాలు కదిలాయి. తెల్లగా మొగలి పుప్పొడిలా ఉన్న పంటితో కింది పెదవిని మడిచి నొక్కి "సరే" అను






కున్నట్టు తలాడించి అంది ...

"నేనే వద్దని వ్రాశాను"

"ఎందుకు ?"

"నాన్నకి తెలిసింది. కొట్టాడు" తల వంచుకుని చెప్పింది. చెప్పొద్దూ నాకూ భయం వేసింది.

వెంటనే సుమ తల పైకెత్తి మళ్ళీ సూటిగాచూస్తూ అంది.

"నాకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు."

గతుక్కుమనిపించింది. గుటక మింగానా ?

"భయపడకండి. అందులో మీ పేరు కూడా ఉందంటూ వెళ్ళిపోయింది.

ఇపుడు గుటక వేశాను.

ఎదురువారిముఖంలో అలా నిజాలు వెంటనే తెలిసిపోతాయా లేక అలా తెలుసుకోవడం సుమకున్ననేర్పా ?!

వెనకనుంచి చూస్తున్నాను.

సుమ కళ్ళుతుడుచుకోవడం గమనించాను. వెళ్తున్న సుమ వెనక్కి తిరిగి వేగంగా నా దగ్గరికివచ్చి వణుకుతున్న పెదాలతో ఏడుపు ఆపుకుంటూంది.

ఇలా నవ్వి ... అలాఏడ్చి ... మళ్ళీ అలా నవ్వ గలగడం రుతువులకే చాతనవును. అంది. "ఏడుపు పెళ్ళికాదు. మా నాన్నకొట్టినందుకుకాదు"

నేను ఆశ్చర్యంగా చూశాను.

"మా అమ్మ తిట్టింది"

ఏమని తిట్టిందో ! ? !

"మా అమ్మ చనిపోయింది. నాన్నకి రెండో పెళ్ళి .... ఇలా వరసగా పెళ్ళిళ్ల చేసుకునే వారికి ...."

అలా పెళ్ళిళ్ళు చేసుకున్నవాళ్ళని గడ్డి పోచల్లా విసిరేసి విసురుగా వెళ్ళిపోతోంది సుమ.

* * *

పరీక్షలు దగ్గరవుతుంటే సీరియస్‌గా చదువుతున్న సుమ నిన్నటినుండి మెరుపులాగ తిరుగుతోంది. "మళ్ళీ...ఉత్తరం రాలేదుగదా" అనుకుంటూ నేను క్రాస్ రోడ్స్‌దాటి నడుస్తూ సుమని పరిశీలనగా చూస్తున్నాను.

సుమ ... ఒంటరిగా ... ఆడపిల్లల జట్టులో లేకుండా తీగలమీద నడుస్తున్నట్టు, అటూ ఇటూ చూస్తూ, బాలెన్సు చేస్తున్నట్టు నడుస్తోంది ....

అ ... త .... నే.... పక్కన్నడుస్తున్నది .... అతనే. నేనిలా నిలబడి పోలేదు. వాళ్ళ కంట పడకుండా వెంట బడ్డాను.

నా వయసే ! సన్నగా ఉంటాడు. నల్లటి టెరికాట్ పాంట్‌లో తెల్లటి ఫుల్ షర్ట్ టక్ చేశాడు. ఓ చేతిలో పుస్తకం, కర్చీఫ్ కలిపి పట్టుకున్నాడు. చామనచాయనిపిస్తోంది. ముఖం ఎప్పుడిటు తిప్పుతాడా అని గిజగిజ లాడాను.

య్యా! క్లీన్ షేవ్....నిజమే మొహంలో చెప్పుకోదగ్గ నిండుతనం లేకపోలేదు.

స్కూలు దగ్గరయింది. సుమ వెళ్ళలేక వెళ్ళినట్టు జట్టులో కలసి స్కూల్లోకి వెళ్ళిపోయింది.

నలువైపులా గంభీరంగా కలయచూసి ఏదో తల పంకించి ఇటు వచ్చేశాడతను.

హోటల్లో టీ తాగాడు.

మింట్ వేపు వెళ్ళిపోయాడు.

* * *

ఆ మర్నాడు .... వాళ్ళకి కనపడకుండా వెంటపడలేక దూరంగా నిలబడి

చూస్తున్నాను. స్కూలునుండి వస్తున్నారు. ఏం మాట్లాడుకుంటున్నారో?! సన్నగా నవ్వడం, తలాడించడం, చేతులు అసహాయంగా తిప్పి భుజాలు ఎగరవేయడం పక్కలకి బెరుగ్గా చూడడం ....

బాధగా మెల్లగా విడిపోవడం.

నాలోని "అది" ఓర్వలేనితనం అనొచ్చు. అది పదునుగా అటూ ఇటూ తిరుగుతున్న చైనా చాకులాగా .... నాకే గుచ్చుకుంటుందేమోనన్నంత చలాకీగా, రహస్యంగా .... దాక్కుంటూ ... తొంగి చూస్తూ .... దడిపిస్తూ ... ధైర్యం కలిగిస్తూ ...

◆ ◆ ◆


సుందర్రావుగారిక్కి హిందూపేపరు ఇస్తూ చెప్పేద్దామనుకున్నాను. ఆయన ముఖం చూడగానే తన చేతిలో దెబ్బలుతిన్న సుమ ఏడుస్తూ కనిపించి నా వెనక నా భుజాల మీద దాక్కుంటున్నట్టనిపించి ఆయనసలు ఏమీ అడక్కపోయినా–"ఏమీలేదంటూ" వెనక్కొచ్చి, అరగంటసేపు అటు చెప్ప లేకపోయినందుకు ..., ఎందుకు చెప్పలేక పోయానో అని సమాధానం చెప్పుకున్నందుకు నన్ను నేను ఎడాపెడా తిట్టుకున్నాను.

ఏమీ తోచక ఆ సాయంత్రం చైనా బజారంతా చెడతిరిగి ఓ బెల్ట్ కొనుక్కున్నాను.

ఇంటికొచ్చి అన్నం తినకుండా బోర్లా పడుకున్నాను. హార్బరులోని షిప్‌ల సైరన్ హారన్ల రొదకు చెవులు గట్టిగా మూసుకున్నాను. వీపు తట్టినట్టుంటే ఉలిక్కిపడి లేచాను.

సుమ!

కూర్చున్నాను.






"చెవులు పనిగట్టుకుని చేతుల్తో మూసుకుని పడుకున్నారు. వినపడదేమోనని తట్టాను" ఎడం చెంపమీద చెయి వేసుకుని ఆలవోకగా అంది-నేను మళ్ళీ సర్దుక్కూర్చుని తననీ కూర్చోమన్నట్టు చేత్తో సైగచేశాను. తల అడ్డంగా ఆడించింది.

"చూశారుగదా ...." అంది.

నన్ను గమనించిందన్నమాట.

"ఆఁ..." అనాలోచితంగా అన్నాను.

"దగ్గరగా మాట్లాడుకుంటే బాగుండును. బజార్లో .... భయంగా ఉంది"

నేనేం మాట్లాడలేదు.

"మీ...మీ...ఇంట్లోకి రమ్మనండి" నా భావన కళ్ళల్లో కన్పిస్తూందేమోనని నా వేపు చూస్తూ నాచూపుల్లో వెతుకుతోంది.

"అలాగే ..."

చటుక్కున ఎవరో పిలిచినట్టు వెన్ను తిరిగి ఇంట్లోకి వెళ్ళి తోడుకోసం మజ్జిగ తీసుకెళ్తున్న సుమ ఓసారి వెనక్కి తిరిగి చూసింది.

ఆ చూపుల్లో మిలమిలలున్నాయి. ఆ మిలమిలలో ఆవేదనల వాగ్దానాలు అద్దం పట్టిన ఉల్కలున్నాయి.

• • •

"ఆ అలాగే ..." ఎలా అన్నానీ మాటలు?!

అతన్నెందుకు తీసుకు" రావాలి? వీళ్ళసలు ఏక మాట్లాడుకోవాలి!

పక్కింట్లో పిండి రుబ్బడం ఆగింది.

నేను ఎంత మెత్తగా అయిపోయానో అంత పదునుగానూ తయారయాను.

ఇటీవల అప్‌స్టెయిర్స్‌లోని రూముని రిపేరు చేయిస్తున్నాను. రూములో పాత కుర్చీలని రెంటిని అప్పుడే వేశాను. ఓవైపు వాకిలికి తలుపులు ఇంకా బిగించలేదు బందులు వేయని తలుపులు వాకిటికి అడ్డంగా పెట్టాము. పక్క గదిలోకి వెళ్ళి ఈ గదిలోకి ఆ తలుపు చెక్కల పక్కగా నిలబడి చూశాను. కన్పిస్తోంది!

కిందికి వెళ్ళిపడుకొని చెమట తుడుచుకున్నాను.

• • •

ముందుగా అతన్నే తీసుకువచ్చి మేడమీద కిటికీ దగ్గర నిలబడి సుమకి చెయి ఊపి రమ్మన్నట్టు సైగచేశాను.

పక్క గదిలోకి వెళ్ళి ... తలుపు చెక్కల దగ్గర నిలబడ్డాను. నా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు నాకే ... పెద్దగా ... వినిపిస్తూ, అరికాళ్ళకు చెమట పడుతూ, మాటలు వినపడకపోతే చూడాలికదా...

అతని చేయి అప్రయత్నంగా సుమ వేపు సాగింది. సుమ కొంచెం జంకి చెయి వెనక్కి తీసుకున్నా ఆమరుక్షణంలో తనే కదలివెళ్ళి తన ఎడం చెంపని అతని గుండెలమీద పెట్టి ... గట్టిగా హత్తుకుంది.

తత్తరపాటుతో నేనటూ ఇటూ చూశాను, గాజులు సన్నగా శబ్దంచేశాయి.

ఎడంగా నిలబడి తనవేపే చూస్తున్నా, సుమ ఎడంచెవి మీద ...

—వచ్చు—

తలపైకెత్తి, గడ్డం గట్టుమీద... ముద్దుపెట్టుకోవడం బాగావచ్చు వేగంగా వెళ్ళి వాళ్ళముందు నిలబడ్డాను. వాళ్ళసలు నేనున్నట్టు గమనిస్తేనా .... వాళ్ళ చుట్టూ తిరిగేను ... ఊహుఁ ...

"ఏవిఁట్రా ? మంచంచుట్టూ అలా తిరుగుతున్నావ్ ...." అంటూ కేకవేసి

తట్టిన చిత్రమ్మామ్మ ...

నేను మంచంఎక్కి అ ద రా బా ద రా పక్క సర్దుతున్నా అలాగే చి త్ర ం గా చూస్తూ నిలబడిఉంది. చి త్ర మ్మా మ్మ చేతిలోని స్టీలుబక్కెటు, బ క్కె ట్ లోని పేడకళ్ళాపి, అ ం దు లో ని పుల్ల నాకు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

కలా ?!!

♦ ♦ ♦

మూడోరోజు అది.

ఎదురుగా నిలబడ్డాను.

స్కూలునుండి వస్తున్న సుమ, అతను ఆగారు. సుమ నన్ను అతనికి పరిచయం చేసినట్టు చూసి వెళ్ళిపోయింది.

నేను అతన్ని ఎలా చూస్తూన్నానో అతనూ నన్ను దాదాపు అలాగే చూస్తు న్నాడు.

చెట్టుమీద పిట్టల అరుపులు.

నాపేరు చెప్పాను.

"మైనేమ్ నాగరాజు..." పేలవంగా నవ్వాడో....నవ్వడానికి ప్రయత్నించాడో అందులో ఈజ్ లేదు.

"రండి కాఫీ త్రాగుదాం" అన్నాను ఇంగ్లీషులోనే. పక్కనున్న హోటలుకు దారితీస్తూ. మ ం త్రి ం చి నట్టు నా వెనకే నడిచాడు.

కూర్చున్నాము.

అతనికి తమిళం రాదని ఊహించాను.

"టిఫిన్ ఏదైనా తీసుకుంటారా ?" మా సంభాషణలు ఇ ం గ్లీ షు లో నే జరిగాయి. ఆపాదమస్తకం పరిశీలిస్తున్నాడు నన్ను. నేనూఅంతే! ఇబ్బందిగా మ ం చి నీ ళ్ళు రెండుగ్లాసులు త్రాగాడు.

ఏంచేస్తుంటారు ?" నా ఊ హ ల ను






బేరీజు వేసుకుంటూ అడిగాను.

పాంట్ జేబులోంచి ఐడెంటిటీకార్డుతీసి చూపించాడు.

ఫోటో - ఎస్. నాగరాజు రిసెర్చి స్కాలర్ క్రింద రెండు సంతకాలు.

డిపార్ట్‌మెంట్ అఫ్ జువాలజీ, నాగపూర్ యూనివర్సిటీ అని ఓ సంతకం, క్రింద రబ్బరుస్టాంపు.

నేను బియస్సీ మానివేయకుండా ఉండాల్సింది. అసలీజువాలజీ వంటపట్టకనే మానేశాను.

"ఏ సబ్జెక్టులో రిసెర్చి చేస్తున్నారు?"

"స్నేక్స్ ... పాముల మీద ...."

అతని సంతకం గుర్తుకొచ్చింది. ముందున్న ఎస్ అక్షరం ఆడుతున్న పాములాగా "అంటే ... విషం మీదనా ..." అన్నాను.

నవ్వి "అలాంటిదే" అన్నాడు.

నేనేం చేసేదీ అడిగాడు. చెప్పాను. కాఫీలు ముగించాము.

"సుమ ఇల్లు మా యింటికి ఎదురుగానే. రండి వెళ్దాం-" అంటూ దారి తీశాను.

పేలవంగా చూసినా ... ఉత్సాహం ఉంది.

"సుమ మీతో మాట్లాడాలంది"

"మీతో చెప్పిందా ?"

"తీసుకురమ్మంది"

ఇద్దరం నడిచాము.

నాకు జ్వరంవచ్చినప్పటి చలిలాఉంది.

అతనికీ సన్నగా చెమట పట్టింది.

స్కూలు బట్టలు మార్చుకుని మాకోసం చూస్తున్నట్టుంది.

నేరుగా అతన్ని పైకి తీసుకెళ్ళాను.

"కింద మట్టిగాఉంది, రిపేరు చేయిస్తున్నాం" అన్నాను కుర్చీ తుడుస్తూ -

నేను బయటికి వెళ్తుంటే సుమ ఎదురు వచ్చింది బిక్కుబిక్కుమంటూ.

కిందికి దిగినట్టేదిగి నేను మళ్ళీ ఆ పక్క గదిలోకి వెళ్ళాను.

శబ్దంలేదు.

చూశాను.

ఎవరూ కుర్చీలో కూర్చోలేదు.

చేతులు వెనగ్గా పెట్టుకొని గోడకానుకుని నిల్చున్న సుమ గుండెలు వేగంగా కొట్టుకుంటున్నట్టు ఎద అదిరిపడుతోంది.

అతను అంతసేపూ సుమ కళ్ళల్లోకి చూసి, కర్చీఫ్ తీసి ... ప్రయత్నంచేసి మాట్లాడలేక నవ్వినగొంతులా ...ఏడుపు వచ్చినపుడు ఆపుకోలేని కంఠంతో శబ్దం చేశాడు. సుమకీ ... గోడకీ మధ్య టప్ మన్న శబ్దం. తాను చెయి తీయగానే టపటపమంటూ ఎడంచేతి గాజులు రెండూ రాలిపోయాయి.

నిర్లిప్తంగా చూసింది వాటివేపు.

నాగరాజు బలవంతంగా మొహం గట్టిగా రుద్దుకున్నాడు.

గర్భగుడిలో మొక్కులు, కోరికలు అన్నీ మర్చిపోయినట్లు నా మనసులో ఆదో రకమైన ప్రశాంత కర్పూర సువాసనలు.

"కల" అన్నాడు.

"కాదు" అంది.

"సుమా" అన్నాడు.

కలకాదు సుమా అని నేను మనసులో గొణుక్కుంటూ నిశ్శబ్దంగా గుటక వేశాను.

రెండుక్షణాల నిశ్శబ్దం.

తల వంకించి, అలవోకగా మెడవంచి సుమ వడిగా కిందికి దిగింది.

నేనూ బయటికి వచ్చాను.

అతను మెట్లుదిగి వెళ్ళిపోయాడు.

వేగంగా వెళ్తున్న అతన్ని నేను వెనక్కి పిలవలేదు. అతనెక్కడుంటాడో అడిగి తెలుసుకోలేదు. అనవసరం అనుకున్నానో, నిర్ణయించానో నాకు తెలిసే స్థితిలో నేనూలేను.

మేడపైకి వెళ్ళాను.

ఇంకాపైకి, టెర్రెస్ మీదకి వెళ్ళి కలయచూశాను.

ఆరోజు వర్షం లేదు.

కానీ సిటీఅంతా వానకి కడిగినట్టుగా కన్పిస్తోంది.

• • •

తన కోరిక ప్రకారం చిత్రమ్మామ్మ అస్థికలు కాశీ తీసుకెళ్ళాను.


రైల్వేస్టేషన్లో ఓ గుంపులో కనపడ్డ నాగరాజును పోల్చుకున్నాను. చూడనట్టు నటించాను. తను చూశాడు గాబోలు. నవ్వుతూ నాదగ్గరికి వచ్చాడు. ఇంటికి తీసుకెళ్ళాడు.

మాటవరసకి వద్దన్నాను. అది మాట వరసని అతనికి తెలుసు. అతనెలా వుంటున్నాడో... అంటే ఇల్లు, ఇల్లాలు నాకు వెంటనే తెలుసుకోవాలని ఉంది.

తాళం వేసిన తలుపు చూడగానే పెళ్ళి కాలేదా? అనిపించింది. ఏమో!

ముందరగది గందరగోళంగా ఉంది. అరడజను బూట్లజతలు, చిందర వందరగా కాగితాలు, చిమ్మని బూజు, అస్తవ్యస్తంగా సామాను, గోడకి కాకిదుస్తులు కుప్పగా వేళాడుతున్నాయి.

"లోపలికెళదాం రండి" అంటూ ఇంకో గది తలుపు తీశాడు.






ఆశ్చర్యం!

ఓ మంచం, తెల్లటి దుప్పటి కింద పరుపు. టేబిల్, ఛెయిర్, ఈజీఛెయిరొకటి ఓమూల పూలకుండీలు, వాటిమధ్య టిపాయ్‌లాంటిదానిమీద టేప్‌రికార్డర్.

గోడమీద అందంగా అమర్చబడ్డ నగిషీ చెక్కపీటలు. ఓ చెక్కపీటమీద ఇత్తడి నగిషీ బుట్ట, బుట్టలో నల్లగా .... ఏవిటో అర్థంకాక పట్టుకు చూశాను.

"నల్ల మట్టిగడ్డ."

ఇంకో కార్నర్‌లో గిజిగాడిగూడు, మరింకో నగిషీ చెక్కపీటమీద తెల్లటి చలవరాయి. చెక్కనిది. మామూలు రాయి అంతే!

"మీరు జబల్‌పూర్ మీదనుండి వచ్చారా?" అడిగాడు.

చలవరాతి కొండలు నా మదిలో మెదిలాయి. మళ్ళీ మట్టిగడ్డవేపే చూస్తున్న నాతో అన్నాడు "మట్టి"

నేను అర్థంకాక నవ్వాను.

"టు డస్ట్ రిటర్నెస్ట్ అనేది మర్చిపోకుండా" అంటూ నవ్వాడు.

◆ ◆ ◆

అక్కడున్న మూడ్రోజులు తన రూములోనే ఉంచుకున్నాడు. ఒంటరిగానే ఉండడంచేత నా విషయాలన్నీ చూశాడు.

అడ్రసు అడిగితే ఇచ్చాను.

రైల్వేస్టేషనుదాకా వచ్చాడు. రిజర్వేషన్‌కూడా అతనే చేయించాడు.

ఏంమాట్లాడ్డానికి తోచక అన్నాను. "ఇలా అస్థికలు తెచ్చినవారికి ఆతిథ్యం ఇచ్చారు. సాధారణంగా తప్పు అంటారు. నేనుమీరూముకి రాకుండా ఉండవలిసింది.

"డోంట్‌వర్రీ. నాకేం ఫరవాలేదు. అది ఈ ఊరి స్పెషాలిటీ"

టాటా చెప్పాడు -

నేను చెప్పలేదు.

పోలీసు ఆఫీసరయినా అతను సుమ ఎక్కడుందని నన్ను అడగలేదు.

కానీ మా ఇద్దరిమధ్య సుమ ఉన్నట్టే మాతో తిరుగుతున్నట్టే ఉంది.

అసలు నేను సుమని పెళ్ళిచేసుకున్నట్టు తెలుసోలేదో ....?


నేను చెప్తేగదా తెలిసేది!

◆ ◆ ◆

ఓ పదిరోజుల తర్వాత ఉత్తరం వచ్చింది. సుమ సీలువిప్పని కవరు ఇచ్చి "మీరు అతన్ని కలుసుకున్నట్లు చెప్పలేదు" అంది. హాండ్‌రైటింగ్ పోల్చుకుందన్నమాట! ఉత్తరం తెరిచాను. ఎందుకు తను విప్పి చదవలేదనుకుంటూ-

"డియర్‌సర్! జీవితంలో మిమ్మల్ని మళ్ళీ కలుసుకుంటాననుకోలేదు. మీరే వచ్చి నన్ను కలుసుకున్నారు.

సుమ మీతోనే ఉందనుకుంటున్నాను. ఎందుకు చెప్పలేదు? ఐయామ్‌సారీ! నేనూ అడగలేదనుకోండి. చెప్పలేదు గాబట్టి మీరు కలిసే ఉన్నారనుకున్నాను. మీకెపుడు పెళ్ళయింది? పిల్లలెంతమంది? సుమని అడిగినట్లు చెప్పండి. పేర్లుచెప్పని మీ పిల్లల్ని ఎప్పుడో ఒకప్పుడు ఎత్తుకుంటానని అల్లిబిల్లి తిప్పుతానని చెప్పండి. వీలుంటే ఉత్తరం వ్రాయండి" ఉత్తరం సుమకిచ్చాను. పూర్తిగా చదివాక ఎక్కడ మీరు కలుసుకున్నారంది ఉత్సాహంగా - నేను పూసగుచ్చినట్లు అంతా చెప్పాను. "రాగానే ఎందుకు చెప్పలేదు?" అంటూ నా చెవి నులిమింది.




ఆరాత్రి నిద్రపట్టని సుమ నన్ను అదోలా చూస్తూ అడిగింది. "మీకు పోలీసులు అంటే పోలీసాఫీసర్లు నచ్చుతారా?" నసేమిరా నచ్చరు. మనుషులుకాదు... చేసే ఉద్యోగం. ఎందుకో.... నాక్కూడా అక్కడ అలాగే అనిపించింది."

"పోనీ .... అంటే ... నాకూ ఇష్టం లేదు. పోనీ ...., ఆ ఉద్యోగం మానెయ్యమని ఉత్తరం వ్రాయరూ?" అంది గారంగా -

వ్రాశాను.

తిరుగు టపాలో ఎయిర్ మెయిల్ ఉత్తరం వచ్చింది. "నేను ఉద్యోగానికి రిజైన్‌చేసి ఇక్కడ యూనివర్సిటీలో చిన్న ఉద్యోగం కమ్ టిచింగ్ జాబ్ చేస్తున్నా" నంటూ.

♦ ♦ ♦

ఇది కథయితే ....,

సుమని వెళ్ళి కాశీలో అతనిదగ్గర వదిలిపెట్టి హీరోననిపించుకుందును. నాకు చెప్పకుండా సుమ వెళ్ళిపోయి ప్రపంచంలో ప్రేమతత్వమే గొప్పది అని నిరూపించి ఉండును. లేదా నాగరాజు మా యింటికివచ్చి "నన్ను మర్చిపోయి నా కంటె ఉత్తముడయిన నీ భర్తని గౌరవించు" అంటూ పతివ్రతాధర్మం ప్రబోధించి ఉండును.

పోనీ మరో రచయిత మా ముగ్గురిలో ఎవరిదైనా ఒకరి ఫోటో గోడకి తగిలించి దండ వేయించి ఉండును.

జీవితం ....

జీవితం వేరు. నాగరాజుకు పెళ్ళి! వెడ్డింగుకార్డు మాకూ వచ్చింది. పెళ్ళి మొగల్‌సరైలో. నిజంగా వీలుకాక నేమేం వెళ్ళలేదు. పెళ్ళయ్యాక తనకి 'డీసెల్ లోకో వర్క్స్'లో ఉద్యోగం వచ్చినట్టు ఉత్తరం.

తరవాత పిల్లల ఫోటోలొచ్చాయి.

ఈ సంవత్సరం ఎల్. టి. సి తో మద్రాసు వస్తున్నట్టు రాశాడు.

మా పిల్లలు వాళ్ళతో హిందీ ఎలా మాట్లాడాలో రిహార్సల్స్ వేస్తున్నారు.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే ....

మా ముగ్గురిలో ఎవరమూ ఏమీ తప్పు చేయలేదని మిగతా యిద్దరికీ తెలుసు. ఎదుటివారి మీద మా అందరికీ ఉన్న గౌరవమే మమ్మల్నికథల భ్రమలనుండీ సినిమా మాయనుండీ తప్పించింది.